

పిల్లలను బడికి పంపించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పరిశీల గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎస్.సుందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని ఆ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగా హన కల్పించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

గిరిజన సమస్యల పరిష్కారమే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు:- గిరిజన ప్రాంత సమస్యలపై తనకు అవగాహన ఉందని గిరిజన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాకు మూడవ కలెక్టర్ గా ఎస్ కుమార్ గురువారం తన చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెడతానని, రోడ్లు, మొబైల్ కనెక్టివిటీ మెరుగు పరిచేందుకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. విద్యా వ్యవస్థను మెరుగు పరుస్తామని, విద్యపై నిత్యం సమీక్షలు నిర్వహించి ఆశ్రమాల్లో సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్డు కనెక్టివిటీ జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు.ఉపాధి హామీ పథకాన్ని మరింత మెరుగుగా అమలు చేసేందుకు గిరిజనులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేపడతానని, పత్రికల్లో వచ్చే కథనాల పై స్పందించి తక్షణం పరిష్కరిస్తానని, ఎప్పుడైనా ఫోన్ చేసి గ్రామ సమస్యలపై చెప్పుకోవచ్చునని చెప్పారు. సమస్యలు ఉంటే 08935293120 నంబర్‌కి ఫోన్ చేసి సమస్య చెప్పాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

పాడేరు:జిల్లాలో ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే అధికారుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ దిశానిర్దేశం చేసారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించి నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఉపేక్షించనని అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయం సిబ్బందితో జిల్లా అధికారులు సమావేశాలు నిర్వహించి సమర్ధవంతంగా పని చేయాలని చెప్పారు.ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరగాలని తెలియజేసారు. పార్శ్య ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. దోమల నివారణ మందు రెండవ విడత పిచికారీ పనులు ప్రారంభించాలని సూచించారు. స్ప్రేయింగ్ పక్కాగా జరగాలన్నారు. వైద్య సిబ్బంది, వి. ఆర్. ఓలు, అంగాన్వాడీ వర్కర్లు సమన్వయంతో స్థానిక సర్పంచులు భాగస్వామ్యంతో పిచికారీ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రంపచోడవరంలో సోమవారం, చింతూరులో బుధవారం, పాడేరులో శుక్రవారం మీకోసం ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజల నుండి వినతులు స్వీకరిస్తా మన్నారు. తుఫాను వరద ప్రభావిత ప్రాంతాలలో పునరావాస చర్యలు చేపట్టడానికి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, రంప చోడవరం ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఎస్. ప్రశాంత్ కుమాం,. చింతూరు ఆర్‌డిఓ చైతన్య, డి.ఆర్.ఓ బి. పద్మావతి, ఎన్‌డిసిలు శర్మ, భవాని, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రాజు, డి.ఆర్.డి.ఏ పిడి మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, డి. హెచ్. ఓ రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి నంద్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకలు ఐ. కొండలరావు పాల్గొన్నారు.

కలెక్టర్ దినేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా 2013 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఎఎస్ దినేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మోదకొండమ్మ అమ్మవారి పాదాలు వద్ద రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు ధాత్రి రెడ్డి, ఎస్. ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ బి.పద్మావతి, డిపిఆర్ఓ గోవింద రాజులు, స్థానిక తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పాదాలకు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. పిఎంఆర్సి అతిథి గృహం చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు అధికారులు స్వాగతం పలికారు.

నలుగురు మిలీషియా సభ్యుల లొంగుబాటు

ప్రజాశక్తి-పాడేరు:మావోయిస్టు పార్టీ గాలికొండ దళానికి చెందిన నలుగురు మిలీసియా సభ్యులు అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఎదుట గురువారం లొంగి పోయారు. ఈ మేరకు స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వచ్ఛందంగా లొంగిపోయిన మిలీషియా సభ్యుల వివరాలను ఎస్పీ వెల్లడించారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లి గ్రామానికి చెందిన తాంబేలు సాయిరాం, ఇదే పంచాయతీలోని అన్నవరం గ్రామానికి చెందిన వంతాల కిరణ్, తాబేలు రమేష్, జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పెదపాడు గ్రామానికి చెందిన కొర్ర బాబురావు నలుగురు మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎస్పీ వెల్లడించారు. వీరు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో జరుగుతున్న అవగాహన కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా వీరు లొంగిపోయినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్‌సిన్హా

మన్యంలో కుండపోత వర్షం



అనంతగిరి మండలం టెంగలబంధ గెడ్డ దగ్గర వేచి ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో గత మూడు రోజులుగా వరుసగా సాయంత్రం పూట భారీ కుండపోత కురుస్తుంది. ఉదయం నుంచి మూడు గంటల వరకు వాతావరణం మామూలుగా ఉంటూ సాయంత్రం ఐదు గంటల నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుంది. వర్షం కారణంగా మండల కేంద్రంలోని వీధి కాలువలు,రోడ్లు పూర్తిగా జలమయంగా మారాయి. మన కేంద్రంలోని మూడు రోజుల జంక్షన్ గుంటసీమ రోడ్డుపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో మురుగునీరు నివాస గహాలకు చేరుతుండడంతో స్థానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులు కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని కించుమండ, గోరాపూర్, చాపరాయి జలపాతం గేడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాపరాయి జలపాటంలో పర్యటించే పర్యాయతకుల సంఖ్య కూడా తగ్గింది. వ్యవసాయ రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ బిజీబిజీగా తమ వ్యవసాయ పనులను చేసుకుంటున్నారు.

అరకులోయ :అరకులోయలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు తీవ్రమైన ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరి అయిన ఈ ప్రాంత వాసులకు ఇప్పుడు కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు ఇబ్బంది పడక తప్పడం లేదు. గత రెండు రోజులుగా మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షాలు సాయంత్రమైనా కనీసం తగ్గక పోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసం బయటకు వెళ్లలేని పరిస్థితి కూడా నెల కోవడంతో ఇటు గిరిజనులు అటు వాహన చోదకులకు ఇబ్బంది పడుతున్నారు. కుండపోత వర్షం కురుస్తుండటంతో కొండ చరియలు విరిగి పడుతాయోనని పలు గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.



సీలేరులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ

హుకుంపేట: మండలంలోని గూడా పంచాయతీలో బుధవారం రోజున కురిసిన భారీ వర్షానికి గూడా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ప్రహరీ గోడ కూలింది. దాని పక్కన గోడ కూలడానికి సిద్ధంగా ఉంది. కూలిన ప్రహరీ గోడను ప్రభుత్వం నిర్మాణం చేపట్టాలని. ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జీవన్ కోరారు. గతంలో జూనియర్ కళాశాల హాస్టల్ ప్రహరి గోడ కూలి ఆరు నెలలు అవుతున్నా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ప్రహరీ లేకపోతే విద్యార్థులకు భయంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ వెంటనే కూలిన ప్రహరీ గోడలు నిర్మించాలని కోరారు.

గెడ్డలు దాటేందుకు విద్యార్థుల వెతలు

అనంతగిరి:మండలంలోని విద్యార్థులు గెడ్డను దాటి పాఠశాలకరు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కివర్ల పంచాయతీ టెంగలబంధ గ్రామంలో 27 కొండదొర ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నారు.గ్రామంలో 25 మంది విద్యార్థులు 1వ తరగతి నుండి 5 తరగతి చదువుతున్నారు. గ్రామం నుండి గంగవరం ఎంపిపి ప్రైమరీ ఎలిమెంటరీ పాఠశాలకు వెళ్లాలంటే రెండు గ్రామ మధ్య లో ఉన్న గెడ్డ దాటి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాలి.కొద్దిపాటి వర్షం కురిసినా నీటి ఉధృతి విపరీతంగా ప్రవహిస్తుంది. మూడు రోజులు పాటు ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, రాపోకలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో గురువారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఆరుగంటల వరకు ఏకధాటిగా కుండపోత వర్షం కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. సీలేరు మార్కెట్ రోడ్డు ఆనుకొని ఉన్న ఎపిజెన్‌కో డ్రైనేజీ లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మార్కెట్ సెంటర్‌లో వర్షపునీరంతా రోడ్డుపై ప్రవహించింది.. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వర్షం కాస్తా తెరిపినిచ్చినప్పటికీ తర్వాత మళ్లీ వర్షం మొదలై సాయంత్రం వరకు వీడకుండా వర్షం కురవడంతో జనజీవనానికి ఇబ్బందులు తప్పలేదు. రోజంతా వర్షం కురవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. వర్షం కారణంగా సీలేరు పరిసర ప్రాంతాలతోపాటు ఎఒబి సరిహద్దు గిరిజనులు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి సీలేరు రాలేని పరిస్థితి ఏర్పడింది.

మరోవైపు భారీ వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతుల్లో ఎనలేని ఉత్సాహం నెలకొంది. సీలేరు దారకొండ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పోడు, ఖరీఫ్ వ్యవసాయ పనులకు అనువుగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు వీడకుండా కురుస్తున్న వర్షాలతో వాతావారణ చల్లబడి ఉపశమనం పొందారు.



హుకుంపేట మండలం గూడ పాఠశాలలో కూలిన గోడ

కేన్సర్‌పై అవగాహన



కేన్సర్‌పై అవగాహనకు శిక్షణ పొందుతున్న ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు డివిజన్‌లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిహెచ్‌ఒలకు కేన్సర్‌పై మూడు రోజుల అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు .ఇందులో భాగంగా ఐటిడిఎ సమావేశ మందిరంలో వైద్యఆరోగ్యం, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యులకు రెండు విడతలుగా శిక్షణనిస్తామన్నారు. రెండో విడతలో సోమవారం నుంచి బుధవారం వరకు శిక్షణ ఉంటుందని చింతూరు ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్య తెలిపారు.

ఈ సందర్భంగా చింతూరు సిహెచ్‌సి గైనకాలజిస్ట్ డాక్టర్ రమణారావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులలో బిపి, షుగర్, కాన్సర్, శ్వాస సంబంధ వ్యాధులతో దాదాపు 60శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వాటి నియంత్రణలో భాగంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం తదితర కేన్సర్లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి, తగు వైద్యం పొందితే నియంత్రించే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్, నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రోగులను రిఫర్ చేయడం, సకాలంలో సరైన వైద్యం అందేలా చర్యలు చేపట్టడం వంటి అంశాలపై వైద్యులకు, సిహెచ్‌ఒలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేన్సర్, సంబంధిత వ్యాధుల నియంత్రణకు రోగులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం అవసరమన్నారు.

భూమి పండగకు విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- చింతూరు : ఆదివాసీల ఎంతో వేడుకగా జరుపుకునే ప్రాచీన భూమి పండుగకు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ రూ.ఐదువేలు ఆర్థికసాయాన్ని విరాళంగా అందజేశారు. మండలంలోని నిమ్మలగూడెం గిరిజనులు వచ్చి డాక్టర్ జమాల్‌ఖాన్‌ను కలిసి భూమి పండుగను వివరించగా, తనవంతు సాయంగా రూ.ఐదు వేలు అందజేశారు. ఆనాదిగా వస్తున్న పండుగనునేటి తరం ఆచారబద్ధంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేలారే ఆటపాటలు, ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతను పండుగను ఘనంగా జరుపుకుని నాటి సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గిరిజనులతో అన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి

- **ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్**

ప్రజాశక్తి- విఆర్.పురం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ3 ప్రయోజనాలను పునరుద్ధరించి, ఏజెన్సీలోని అన్ని శాఖల ఉద్యోగాలను శతశాతం గిరిజనులతోనే భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించి, ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు. గురువారం మండలంలోని రేఖపల్లిలోఎఎస్‌డిఎస్ సంస్థ ఆవరణలో ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన యువతకు రాజకీయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి తాజాగా ప్రకటించిన డిఎస్‌సిలో ఏజెన్సీలోని ఉద్యోగాలన్నింటినీ ఆదివాసీలతోనే భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ముందే ఆదివాసీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ప్రత్యేక విధివిధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటి సభ్యులు పూనెంసత్యనారాయణ మాట్లాడుతూ చింతూరు ఐటిడిఎ ఆధ్వర్యంలో నాలుగు ముంపు మండలాల ఆదివాసీ నిరుద్యోగులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు నాయకులు కారం సుందరయ్య, శిరపు తాతాబాబు రెడ్డి, నాలారపు ప్రకాష్, వడ్డాది రమేష్, కుంజా నాగిరెడ్డి, కమ్మచిచ్చు సత్తిబాబు, పసుపులేటి, ప్రవీణ్‌కుమార్ పండా, వెంకటేష్ కుంజా, సుదీర్ పాల్గొన్నారు..



మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్‌సిన్హ

మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మండలంలోని వేటుకూరు పంచాయతీ మామిడికోట గ్రామ తెలుగుదేశం సీనియర్ నాయకులు కత్తుల పెద్ద రాజారెడ్డి కుటుంబానికి టిడిపి మండల కమిటీ తరపున స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి భాస్కర్ గురువారం రూ.పదివేల ఆర్థికసాయం అందించారు.

ఈనెల 13న మృతి చెందిన రాజారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మండల టిడిపి నేతలు, రాజారెడ్డి పెద్దకర్మ నిర్వహణకుబాధిత కుటుంబసభ్యులు కత్తుల సురేష్ రెడ్డి ఝూన్సీలకు మండల కమిటీ వారు రూ.పదివేల నగదును అందజేశారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి పల్లాల, తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షులు. గురుకు శేష్‌కుమార్, బిజెపి మండల అధ్యక్షులు రేవుల రామకష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు కర్రి సన్యాసిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు మండా రత్నాజీ, మండల సెక్రెటరీ జానకిరెడ్డి, ఉపసర్పంచ్‌లు కత్తుల కుమార్ వరప్రసాద్‌రెడ్డి, పల్లాల భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు కథల మొట్టిరెడ్డి, కత్తుల సాంబశివరెడ్డి, కత్తుల సోమాలమ్మ, కత్తుల సోమిరెడ్డి, చిరంజీవి రెడ్డి, ఐటిడిపి మారేడిమిల్లి మండల కోఆర్డినేటర్ పాము రాంబాబు, తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'జన్‌మన్'లో ఉచిత విద్యుత్ కనెక్షన్లు

ప్రజాశక్తి- చింతూరు : ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం ద్వారా మండలంలో మారుమూల గ్రామాల్లోని అర్హులైన పివిటిజి, నాన్ పివిటిజి లబ్దిదారులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ మేరకు పలు గ్రామాల్లో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుతోపాటు 750మందికి ఉచిత విద్యుత్ కనెక్షన్లు కింద మీటర్లు, సర్వీసు వైరు, బోర్డులు ఇచ్చి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు ఎపిఇపిడిసిఎల్ డిఇఇ, ఎడిఎ, ఎఇఇల పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, గణేష్ ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఇన్నాళ్లుగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని వేడుకున్న గిరిజనులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఉపాధి నిధులతో సిసి రోడ్డు నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న రేఖపల్లి సర్పంచ్ సరోజిని, సిపిఎం నేతలు.

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.9లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం నేతల బృందం గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ, గొల్లగూడెంలో రోడ్డు సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో గిరిజనులు చాలా ఇబ్బందులకు గురయ్యే వారని, స్థానికుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఉపాధిహామీ నిధులను మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 350మీటర్ల సిసి రోడ్డును గొల్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ా పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గొల్లగూడెం ప్రజల కష్టాలపై స్పందించి, అధికారులతో మాట్లాడి ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చొరవ చూపిన సర్పంచ్ సరోజిని, ఇతర నేతలకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, హజరత్, ఇంజనీరింగ్ అధికారి తరుణ్ పాల్గొన్నారు.



చేపడుతున్న రోడ్డు పనులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కితలంకి పంచాయతీ కిన్నంగుడ, పడాల పుట్టు, కుమారగొంది గ్రామాల్లో రోడ్డు నిర్మాణం పనులను గురువారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ సుబ్బారావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రెండు, మూడు నెలల్లో ఈ రోడ్ల నిర్మాణం పనులను పూర్తి చేస్తామని అధికారులు చెప్పారన్నారు. రోడ్డు నిర్మాణంతో మూడు గ్రామాలకు రవాణా కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లయ సంస్థ ప్రతినిధులు

ప్రకృతి ఎరువుల తయారీపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: ప్రకృతి సిద్ధమైన ఎరువులు వాడాలని లయ సంస్థ ప్రతినిధులు సూచించారు. మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డ, అంబవాడ తదితర గ్రామ ప్రజలకు గురువారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వాడటంతో భూమిలోని సారం తగ్గి భూమి బీటలు బారుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడంతో లాభాలు ఎక్కువగా ఉంటాయని, రైతులకు దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ మేనేజర్, కోఆర్డినేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని అతి మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కొర్ర త్రినాధ్ ఆధ్వర్యంలో చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో ఆరోగ్యవంతంగా జీవితాన్ని గడపవచ్చు అని తెలిపారు.

తడి, పొడి చెత్త విడివిడిగా సేకరణ కోసం రెండు రకాల బుట్టలను పంపిణీ చేశామన్నారు. డిడిఓ సోమేశ్వర రావు మాట్లాడుతూ, వీధి దీపాలు వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బి.ప్రశాంత్, ఉప సర్పంచ్ అర్లాబుసత్యం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

డిఎఫ్ఒకు సిపిఎం బృందం వినతి



వినతిపత్రం ఇస్తున్న గంగరాజు, నాయకులు

ప్రజాశక్తి -అనంతగిరి: మారుమూల గ్రామాలకు రోడ్డు నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సీపీఎం బృందంతో కలిసి గురువారం అల్లరి జిల్లా డిఎఫ్ఒ వినోద్ కుమార్, అనంతగిరి రేంజర్ దుర్గాప్రసాద్‌లకు లిఖితపూర్వకంగా విన్నతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా పారెస్టు అదికారులతో ఆయన మాట్లాడుతూ, గుమ్మ పంచాయతీ కడరేవు, కర్రిగోడ గ్రామాల్లో రోడ్డు రవాణా సౌకర్యం కోసం 2022-23 సంవత్సరంలో కనెక్ట్ విటి పాడేరు పథకం కింద కోట్లాది రూపాయలు నిదులు మంజూరు అయ్యాయయ్యారు. గుమ్మనిమ్మ ఊట నుండి రోడ్డు పారిమెషన్ సుమారు మూడు కిల్లో మీటర్ల వరకు కాంట్రాక్టు పనులు చేపట్టగా పారేస్టు అదికారులు నిలిపి వేశారన్నారు. నిలిన రోడ్డు పనులు తక్షణమే పన్నప్రారంబించాలని ఆందోళన చేపట్టగా స్పందించిన అదికారులు కడరేవు మీదుగా కర్రిగొడకు పనులు చేపడుతుండగా పారేస్టు అదికారులు నిలిపి వేశారన్నారు. గత్యంతరం ఆయా గ్రామాల ప్రజలకు డోలీ మోతలే శరణ్యంగా మారాయన్నారు. అత్యవసర పరిస్థితితులు వస్తే 8 కిల్లోమీటర్లు కొండకోన మీదుగా మోయవలసి వస్తుందన్నారు. స్పందించిన రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, ఎస్.రాజారావు, నందుల రాజారావు, పెంటారావు, వార్డు మెంబర్ బి.రాజారావు, గోపాలరావు, సింహాద్రి, గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సత్యం పాల్గొన్నారు,

మంత్రిని కలిసిన దొన్ను దొర



మంత్రిని అభినందిస్తున్న దొన్నుదొర, నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్య రాణిని గురువారం తన నివాస గృహంలో టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి సివేరి దొన్నుదొర నాయకులతో కలసి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం మంత్రి దృష్టికి అరకు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. జిఓ 3 పునరుద్ధరణ చేసి గిరిజన యువతకు 100శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంచినీరు, రోడ్డు, విద్య, వైద్యం పై చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామూర్తి, పెదబయలు మాజీ ఎంపిపి వేచ్చంగి కొండయ్య, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు అప్పన్న దొర, వనభసింగి సర్పంచ్ లక్ష్మణరావు, కిలగాడ సర్పంచ్ కోడా శివ శంకర్, సర్పంచ్ పాడి బాలన్న, నాయకులు సతక బొంజు బాబు, కొచ్చా కామేష్, ఎస్టీ సెల్ అరకు అసెంబ్లీ అధికార ప్రతినిధి శంకర్, వంతల వెంకటరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ దిలీప్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సామాజిక పెన్షన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దిలీప్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని 22 మండలాల ఎంపిడిఓలు, వెలుగు ఎపిఎంలతో పెన్షన్ల పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయం సిబ్బందితో పెన్షన్ల పంపిణీ చేయించాలని సూచించారు. జిల్లాలో 1.26 మంది పెన్షర్లు ఉన్నారని స్పష్టం చేసారు. గతంలో రూ.36 కోట్లు పంపిణీ చేసామని, ఇప్పుడు రూ.87 కోట్లకు పెరిగిందన్నారు. ఈనెల 29న డబ్బు విడుదల చేసుకుని జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుండి పెన్షన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. సచివాలయం సిబ్బందిని, అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగుల సేవలను పెన్షన్ల పంపిణీలో వినియోగించుకోవాలని స్పష్టం చేసారు. మొదటి రోజు 70 నుండి 80 శాతం పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. పెద్ద మొత్తంలో నగదు తరలిస్తారు కాబట్టి పోలీస్ అధికారులకు సమాచారం అందించి తగిన సెక్యూటీ పొందాలన్నారు. ప్రతీ 50 మందికి ఒకరు చొప్పున పెన్షన్ పంపిణీ చేయాలని స్పష్టం చేసారు. వెలుగు ఎపిఎంలు క్షేత్ర పర్యటన చేసి పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, డిఆర్‌డిఏ పిడి మురళి, ఎంపిడిఓలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో గండిగుండం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనీఫామ్‌ను గురువారం టిడిపి జనసేన నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు గంద్రెడ్డి రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవర సోంబాబు, అప్పలనాయుడు, సతీష్, శ్రీను, సోంబాబు, అప్పారావు, సన్నిబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి ఉప్పాడ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ పైడిరాజు కథనం ప్రకారం... వార్డులోని కె.గొల్లలపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చందక వెంకటరమణ (42), తన మోటారు సైకిల్ పై భీమిలి వస్తుండగా, ఎదురుగా రాంగ్ రూట్‌లో హీరో ఫ్యాషన్ బైక్‌పై అతి వేగంగా వస్తూ ఓ వ్యక్తి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట రమణ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు అర్ధరాత్రి దాటాక మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమిలిలో ట్యూషన్ చదువుతున్న ఇద్దరు పిల్లలను మోటారు సైకిల్‌పై తీసుకొచ్చేందుకు వెంకటరమణ ఇంటి నుంచి వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు.

షిప్‌యార్డుతో గీతం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక, మేనేజ్‌మెంట్ విభాగాలలో పరస్పర సహకారానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం ప్రో-వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ బిజినెస్ డెవలప్‌మెంట్, ఐటి విభాగాల జనరల్ మేనేజర్ కంమాండర్ జె.పి.గుప్తా గురువారం అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా గీతం ప్రో-వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిపుణులైన విద్యావేత్తలను, శాస్త్రవేత్తలను గీతంలో పనిచేసేలా ఆహ్వానించడంతో పాటు దాదాపు 100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలు, పరిశ్రమలతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమలలో పనిచేసే అధికారులకు మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీతం అధ్యాపకులు పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డు జనరల్ మేనేజర్ కంమాండర్ జెపి.గుప్తా మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద నౌకానిర్మాణ కేంద్రంగా హెచ్‌ఎస్‌ఎల్ గుర్తింపు పొందిందన్నారు. వాణిజ్య, రక్షణ అవసరాలకు తగిన 200 నౌకలను తాము ఇప్పటివరకు నిర్మించామని, 2 వేలకు పైగా నౌకలకు మరమత్తులు నిర్వహించామని తెలిపారు. గీతంతో అవగాహన ఒప్పందం ద్వారా తమ సంస్థలోని వివిధ స్థాయి అధికారులకు గీతంలో శిక్షణ పొందే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గీతం ఆర్ అండ్ డి విభాగం డైరక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, గీతంస్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, గీతం పారిశ్రామిక సంబంధాల డిప్యూటీ డైరక్టర్ సోంభట్ శాస్త్రి, హిందుస్థాన్ షిప్‌యార్డు అధికారులు రాజేంద్రకుమార్ రాజ్‌గోపాల్, రాజేష్‌పాండే, ఎస్.సోమసుందరం, గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీశ్వరి, పలువురు సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్లాస్టిక్ వ్యర్థాలు, తెగిన వలలు వల్ల సముద్రంలో ఉన్న జీవ రాశులకు ప్రాణ నష్టం వాటిల్లనుందని భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ, మత్స్య శాఖ అధికారులు వివరించారు. 'సముద్ర జలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, తెగిన, నిరూపయోగ వలల వల్ల సముద్ర జీవ రాశులకు కలుగు ప్రమాదాలు' అంశంపై విశాఖ, భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ, జిల్లా మత్స్య శాఖ సహకారంతో జివిఎంసి నాలుగో వార్డు ఉప్పాడ ఎఫ్‌డిఒ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునుద్దేశించి మెరైన్ ఇంజినీర్, ఎఫ్ఎస్ఐ అధికారి డి.బామిరెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యర్థాలు, నిరుపయోగ వలలు సముద్రంలో వదిలేయడం వల్ల సముద్ర జీవ రాశులకు ప్రాణనష్టం వాటిల్లనుందని వివరించారు. ఎఫ్ఎస్ఐ అధికారి జివిఎ.ప్రసాద్ మాట్లాడుతూ, తాబేళ్లను వేటాడడం నేరమని, ప్రతి మత్స్యకారుడూ తాబేళ్ల సంరక్షణకు వలలో టర్టెల్ ఎక్స్‌క్లూజివ్ డివైస్‌ను ఉపయోగించాలని సూచించారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు ఆర్.ఈశ్వరరాజు, డి.లావణ్య మాట్లాడుతూ, సముద్ర జీవాల పరిరక్షణ, మత్స్య సంపద పెంపుదలకు భీమిలి తీర ప్రాంతంలో చేపల కృత్రిమ ఆవాస కేంద్రాలు ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే సముద్రంలో మత్స్య సంపద పెరుగుతుందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ, వీడియో ప్రదర్శన నిర్వహించారు.



మాట్లాడుతున్న నర్సింగరావు

10న కోర్కెల దినాన్ని విజయవంతం చేయండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటోందని, ఆ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు జులై 10న దేశవ్యాప్తంగా తలపెట్టిన కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతోందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి తగిన కార్యాచరణ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. పిఎఫ్‌కు సంబంధించి యాజమాన్యం వాటా చెల్లించకపోతే ఫెనాల్టీతో చెల్లించాలన్న నిబంధన తొలగించారని తెలిపారు. ఇప్పుడు యాజమాన్యం కార్మికుల ఖాతాలో జమచేయవలసిన వాటాను ఎప్పుడైనా కట్టవచ్చునని అన్నారు. ఇప్పటి వరకూ ఫెనాల్టీ నిబంధనలు ఉన్నా చాలా కంపెనీలు ఇన్‌టైంలో పిఎఫ్ ఖాతాలో డబ్బులు జమచేయటం లేదని అన్నారు. అలాగే పూర్తి విచారణ జరిపి నాన్‌బెయిల్ వారెంట్ ఇవ్వడానికి వున్న అవకాశాన్ని కూడా తొలగించారన్నారు. దీని వల్ల పెన్షన్ భవిష్యత్తులో వస్తుందన్న గ్యారెంటీ లేకుండా పోతుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం వల్ల కార్మిక వర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందని తెలిపారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, నేషనల్ మోనిటైజేషన్ ఆఫ్ పైపులైన్‌లను ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టరును తొలగించినా కార్మికులను తొలగించరాదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సౌకర్యాలు అమలు జరపాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బిల్డింగు, ఆటో, ముఠా, తోపుడు బండ్లు కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. పై డిమాండ్లతో వచ్చే నెల 10న దేశవ్యాప్తంగా కోర్కెల దినం జరపాలని నిర్ణయించామని, కార్మిక వర్గం విజయవంతం చేసి, మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పాల్గొన్నారు.

జనసేన విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - చింతూరు : కూటమి విజయం సాధించి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ జనసేన శ్రేణులు విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. చట్టి గ్రామం నుండి చింతూరు శబరి వారధి మీదుగా ఆదివాసి అమరవీరుల కూడలి, రాజీవ్ ఇందిరా అంబేద్కర్ కూడళ్లు, పోలీస్ స్టేషన్ మీదుగా ఎర్రంపేట రత్నాపురం నిమ్మలగూడెం గ్రామాలలో బైక్ ర్యాలీ సాగింది. ర్యాలీలో పాల్గొన్న జనసేన శ్రేణులు ఆయుర్వేద వైద్యులు, తెలుగుదేశం నాయకులు ఎండి జమాల్‌ఖాన్ వద్దకు చేరుకొని ఆయనను కలుసుకుని హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ, జనహితం కోసం జనసేన శ్రేణులంతా పనిచేసి, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, మహిళ విభాగం నాయకురాలు తీగల కవిత, రవి, తెలుగుదేశం కార్యకర్తలు ఫిరోజ్, బిజెపి మండల అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి పాల్గొన్నారు.

వీడని పైపులైన్ భయం

- పాయకరావుపేటను చుట్టుముట్టనున్న రసాయన పరిశ్రమలు
- ఆగని హేచరీస్ యజమానుల ఒత్తిళ్లు
- వెంకటనగరం తీరంలో కాకినాడ సెజ్ వ్యర్థాల విడుదలకు యత్నాలు
- హోం మంత్రి అనితపైనే మత్స్యకారుల ఆశలు



వెంకట నగరం సముద్ర తీరంలో పైపులైన్ పనుల కోసం వేసిన మట్టిరోడ్డు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కాకినాడ సెజ్ వ్యర్థ రసాయన పైపులైన్ భయం పాయకరావుపేట తీరప్రాంత మత్స్యకారులను వెంటాడుతోంది. హేచరీస్ యాజమానుల కోసం కాకినాడ సెజ్‌కు సమీపంలోని సముద్రతీరాన్ని వదిలి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని పాయకరావుపేట నియోజకవర్గం వెంకటనగరం సముద్రతీరంలో వ్యర్థాలు విడిచిపెట్టే పైపులైన్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సారి కూటమి ప్రభుత్వం రావడం, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్రతీరంలో పైపులైన్ ఏర్పాటు జరగదని మత్స్యకారులు భావిస్తున్నా.. వారిలో ఇంకా మునుపటి భయం పోలేదు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమళ్లపురం ప్రాంత పరిశ్రమల రసాయనాలు వెంకటనగరం సముద్రతీరంలో వదిలేందుకు గత ప్రభుత్వ కాలంలో జరిగిన పైపులైన్ నిర్మాణ పనులను మత్స్యకారులు కొద్ది కాలం క్రితం అడ్డుకున్నారు. పోలీసు బలగాల మధ్య పనులు పూర్తిచేయాలని చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పైపులైన్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. తరువాత ఎన్నికలు సమీపించడంతో పైపులైన్ పనుల జోలికి ప్రభుత్వం వెళ్లలేదు.

అయితే హేచరీస్ యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గి వెంకటనగరంలో పైపులైన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోవడంతో పైపులైన్ ప్రమాదం మత్స్యకారులకు పోలేదు. గత సర్కారు కాకినాడ్ సెజ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్రతీరాన్ని వదిలిపెట్టి 30 కిలోమీటర్ల దూరంలోని వెంకటనగరం తీరంలో రసాయనాలు విడిచిపెట్టి మత్స్యకారుల బతుకులను దెబ్బతీయాలని చూసింది. పైపులైన్ ఏర్పాటుపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుందని మత్స్యకారులు భావిస్తున్నారు. ఇప్పటికే డెక్కన్ కంపెనీ రసాయనాలను సముద్రంలో వదలడంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. సముద్ర తీరానికి సమీపంలో దొరికే చేపలు కిలోమీటర్లు దూరం వేటకు వెళ్లినా ఇప్పుడు లభించడంలేదు. ఈ నేపథ్యంలో వెంకటనగరం తీరంలో పైపులైన్ ఏర్పాటు జరిగితే పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజానగరంతో పాటు పరిసర తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధికి నష్టం ఏర్పడుతుందని వారు భయపడుతున్నారు. కాకినాడ సెజ్ సమీపంలోని సముద్రంలో వ్యర్థాలు వదిలితే ఆ ప్రాంత హేచరీస్ దెబ్బతింటాయని వాటి యజమానులంతా ఒక్కటయ్యారు. ఆ ప్రాంతంలో పైపులైన్ ఏర్పడకుండా ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే 2023 సెప్టెంబరు 20న బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ సెజ్ నుంచి నక్కపల్లికి తరలించాలని గత రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కు, పైపులైన్ ఏర్పాటును కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకుంటుందా ? ఆ నిర్ణయం రద్దయ్యే వరకు హోం మంత్రి అనిత పట్టుబడతారా ? లేదా ? అనేది వేచిచూడాలి.

కరెంటు కోతలతో జనం ఇక్కట్లు

ప్రజాశక్తి- కూనవరం : మండలంలో కరెంట్ కోతలతో కొన్ని రోజులుగా అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య ఆరోపించారు. ఇంతకుముందు గోదావరి వరదలు సమయంలోనే ఇలాంటి ఇబ్బంది ఉండేదని, కానీ ఇపుడు అలాంటివేవీ లేకుండా రేయింబవళ్ళ ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరాన నిలుపుదల చేస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభం కావడంతో పాములు, తేళ్లు వంటి విషకీటకాల సంచారం ఎక్కువైందని, ఈ నేపథ్యంలో కరెంట్ కోతలతో చీకట్లలో ఎపుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని మన్యవాసులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఒకటో తేదీన రేషన్ సరుకులు ఇవ్వాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలోని లబ్ధిదారులకు ఒకటో తేదీ నుంచి విధిగా రేషన్ సరుకులు పంపిణీ చేయాని తహశీల్దార్ ఎం.వెంకటరమణ ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిసిసి సిబ్బంది, సేల్స్‌మెన్, రేషన్‌షాప్ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ, పిడిఎస్, ఇండియన్ ఎండిఎం, అంగన్వాడీలకు పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులను ముందునెల 30వ తేదీలోగా రేషన్ డిపోలకు జిసిసి గొడౌన్‌ల నుంచి విధిగా తీసుకెళ్లాలని, ఒకటో తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు పంపిణీకి చ్రర్యలు చేపట్టాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం, నిర్లక్ష్యం చేసినా, తూకాల్లో తేడాలు వచ్చినా కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిడిపిఒ ప్రసన్నకుమారి, జిసిసి మేనేజర్ ముర్ల నాగవెంకటరాజారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

న్యాయం చేయరూ..

ప్రజాశక్తి- అడ్డతీగల : మండలం భీముడు పాకుల గ్రామంలో వామ్మంగి లక్ష్మి వ్యవసాయ భూమిలోని జీడి, మామిడితోటను అదే గ్రామానికి వొమ్మంగి అచ్చిరాజు కుమారులు త్రిమూర్తులు ,వెంకటేశ్వర్లు దౌర్జన్యంగా నరికేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన తండ్రి ద్వారా వారసత్వంగా సంక్రమించిన భూమిలో మామిడితోటను పెంచి ,వచ్చిన ఫలసాయంతో ఇరవై ఏళ్లుగా జీవిస్తున్నానని, ఇపుడు తన జీవనోపాధిని దూరం చేశారని వాపోయింది. బుధవారం అనేక చెట్లను నరికేయడంతోపాటు గురువారం ఉదయం కూడా చెట్లను నరికేస్తుండగా, అడ్డుకుని ప్రశ్నించగా, చెట్లకు బదులుగా తనను నరికేస్తామంటూ బెదిరించారని బాధితులు ఆరోపిస్తోంది. రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినావారు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి, తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదనతో అంటోంది.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ